రైతులకు వెన్నుదన్ను..!

- పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న ఏకలవ్య ఫౌండేషన్
- అన్నదాత ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం



మట్టి కొట్టుకుపోకుండా తీసిన గుంత



సాగు చేస్తున్న పండ్ల తోట

సిరికొండ: అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి రైతులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం ఏకలవ్య ఫౌండేషన్ నడుం బిగించింది. వారికి వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తూ.. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. నాబార్డు ఆర్థిక సహకారంతో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద పోచంపల్లి ‹మా తోట ప్రాజెక్టు› ఏర్పాటు చేసి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

రైతు సంఘాలను ఏర్పాటు చేసి..

ఏకలవ్య ఫౌండేషన్ మొదట గిరిజన గ్రామాల్లో గిరిజన రైతులతో రైతు సంఘాలను ఏర్పాటు చేస్తుంది. ఆ రైతు సంఘాల్లో ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకం, చిరుధాన్యాలు పండించడం వంటి వాణిజ్య పంటలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని వివిధ గ్రామాల రైతులు సుమారుగా 180 మంది ఏకలవ్య ప్రోత్సాహంతో పండ్ల తోటలు పెంచుతున్నారు.

ప్రతీ రైతుకు 130 మొక్కలు..

రైతులు తమ ఎకరం చేనులో పండ్ల మొక్కలు పెంచేందుకు 40 మామిడి మొక్కలు, 50 జామ, 40 సీతాఫలం మొక్కలను పంపిణీ చేస్తారు. బావిలో నీటి కోసం యంత్రాలతో పూడిక తీయిస్తారు. విద్యుత్ లేని సమయంలో మొక్కలకు నీటిని అందించేందుకు 500 లీటర్ల నీటిట్యాంకు, పైపు ఏర్పాటు చేస్తారు. పండ్ల తోటలపై అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన్ కేంద్రానికి తీసుకెళ్లి అవగాహణ కల్పిస్తున్నారు. అలాగే పండ్ల తోటలో అంతర పంటగా మినుములు, పెసర్ల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

వడ్డీ లేకుండా రుణం..

పండ్ల తోటలను జంతువుల నుంచి కాపాడుకునేందుకు ఎకరం భూమికి కంచె ఏర్పాటుకు రైతులకు వడ్డీ లేని రుణం మంజూరు చేస్తున్నారు. ఎకరం పెన్సింగ్ కోసం రూ. 12000లను రైతు ముందుగా రూ. 4 వేలు చెల్లించాలి. మిగతాది వడ్డీ లేకుండా వాయిదా పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది.

మండలంలో ఇలా..

ఏకలవ్య ఫౌండేషన్ ప్రోత్సాహంతో ఇప్పటి వరకు లచ్చింపూర్‌లో 40, పోచంపల్లిలో 40, రాజంపేట్‌లో 35, తిమ్మపూర్‌లో 16, ముత్యాంపేట్‌లో 8, కన్నాపూర్‌లో 12, కన్నాపూర్ తండాలో 30 మంది రైతులు పండ్ల తోటలను పెంచుతున్నారు. రైతులు ఆర్థికంగా ఎదగడమే మా లక్ష్యమని ఏకలవ్య ఫౌండేషన్ సంస్థ చెబుతుంది.

ఆర్థికంగా ఎదగాలి



ఏకలవ్య ఫౌండేషన్ నాబార్డు ఆర్థిక సాయంతో మండలంలోని రైతులకు ఎంపిక చేసుకుని వారికి పండ్ల తోటలపై అవగాహన కల్పిస్తున్నాం. ఉచితంగా పండ్ల మొక్కలు, ఎరువులు పంపిణీ చేస్తున్నాం. గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఏర్పడింది.

– సంతోష్, 'మా తోట ప్రాజెక్టు' కో ఆర్డినేటర్, సిరికొండ

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న పద్మభూషన్ రాజు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలని పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు నెలల వృత్తి శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం మహిళ దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థిక స్వాలంబన జరగాలని, వృత్తి నైపుణ్య శిక్షణ ఎంతగానో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేందర్, శ్యామల, మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజురోజుకు సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయని, వాటి గురించి తెలియక అమాయక ప్రజలు మోసపోతున్నారన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి పోలీసు అధికారులమని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్‌మోసానికి గురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, ఏఎస్సై ఖైసర్, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీనియర్ సిటిజన్లు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను వయోవృద్ధుల సమైఖ్య సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం పోలీసు కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. సమైఖ్య ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఎస్పీకి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్పీ వారికి సూచించారు. నాయకులు దేవిదాస్ దేశ్‌పాండే, పల్లా సత్యనారాయణ, కులకర్ణి, నర్సిములు, గంగాధర్, శేషగిరిరావు, కిషోర్, మోహన్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగుల సమస్యలను నివేదించేందుకోసం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక అధికారిని నియమించడంతోపాటు కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు నగేశ్, , సయ్యద్ హంజ, ఉగ్గే నానయ్య, నిరటి మోహన్, శంకర్, మోహన్ పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడమే లక్ష్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోథ్: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడమే తమ లక్ష్యమని హార్వెస్ట్ మినిస్ట్రీస్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. బుధవారం సంస్థ సహకారంతో మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో వీడీసీ సౌజన్యంతో వైద్యశిబిరం నిర్వహించారు. 520 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, గొర్ల రాజు యాదవ్, గొర్ల సురేందర్, రమణ గౌడ్, క్యాంపు నిర్వాహకులు పాస్టర్ పిడుగు సునీల్, హార్వెస్ట్ మినిస్ట్రీస్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, హ్యాండ్ ఆఫ్ హోప్ ఇన్‌చార్జి జయరాజు, వైద్యులు దేవ సహాయం, భార్గవి, స్వాతి, భక్తసింగ్, మనోజ్ఞ, శ్రీధర్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

సిరికొండ: పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదారాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు మాజీ సర్పంచ్‌లు తరలివెళ్లకుండా స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు. బుధవారం మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బోథ్: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను బోథ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అరెస్టులు చేయడం అప్రజాస్వామిక చర్యని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగే వారిపైన రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. మండల కన్వీనర్ దామెర నారాయణ రెడ్డి, సోలంకి రుక్మాన్ సింగ్, గొర్ల సురేందర్ యాదవ్, మునేశ్వర్ సోమన్న ఉన్నారు.

ఇంద్రవెల్లి: అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఆందోళన కార్యక్రమాలు జరగకుండా బుధవారం బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మండలంలోని ఏమాయికుంట మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, దనోరా(బి) మాజీ సర్పంచ్ యేర్మ జాకేశ్వర్, హర్కపూర్అంద్‌గూడ మాజీ సర్పంచ్ కుడే కైలాష్‌లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని అడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆహార పదార్థాల ప్రదర్శన (ఫుడ్ ఫెస్టివల్)ను బుధవారం ఘనంగా ని ర్వహించారు. విద్యార్థులు వివి ధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లు, ఏయే ఆహార పదార్థాలు తీసుకోవాలి, జంక్ ఫుడ్ తీసుకోవడంతో కలిగే నష్టాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జైరాం, లావన్య, భగవాండ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిలో మంటలు



వేసవి వచ్చిందంటే చాలు మండలంలోని పలు అటవీ ప్రాంతాల్లో మంటలు చేలరేగుతాయి. బుధవారం మండలంలోని మామిడిగూడ పరిధిలోని సల్పాల గూడ నుంచి జంబుల్‌ధరి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలోని అటవీ ప్రాంతంలో మంటలు చేలరేగాయి. అటవీశాఖ అధికారులు మంటలు చేలరేగకూడా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – ఆదిలాబాద్‌రూరల్

విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

- కలెక్టర్ రాజర్షి షా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. వంట గది, మధ్యాహ్న భోజనం, స్టోర్ రూంను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యత లేని సరుకులు ఉంటే మండల అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల ఆవరణను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం నియమాలు పాటిస్తూ, కంటి సమస్యతో బాధపడుతున్న వారు ఆర్‌బీఎస్‌కే ద్వారా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. బంగారుగూడ మోడల్ స్కూల్‌లో 18 మందికి దృష్టి లోపం ఉందని గుర్తించి కళ్లద్దాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి నరేందర్, ఆర్‌బీఎస్ అధికారి శ్రీనివాస్, మండల వైద్యాధికారి సర్వారాజ్, ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏటీడీవో అనిల్

ఆదిలాబాద్‌రూరల్: టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పూర్తిస్థాయి వివరాలు రికార్డులలో ఉండాలని అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఏటీడీవో) అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన టీచింగ్ డైరీ సక్రమంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించి నంబర్‌ను రికార్డులలో పొందుపర్చాలన్నారు. ఉపాధ్యాయుల పూర్తి వివరాలు నోట్ బుక్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రొడ్డ శైలజ, ఎస్‌సీఆర్‌పీ మధుసూదన్, టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని పెర్కగూడ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మేనేజర్ మూడవత్ రాజు, ఫీల్డ్ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ బీఎల్ రాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్‌కు వచ్చే ఎలాంటి లింకులను క్లిక్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో టీజీబీ బిజినెస్ సీనియర్ మేనేజర్ ప్రభుదాస్, ఏపీఎం సెర్ప్ సూర్యకాంత్, షేక్‌అబ్దుల్, ఫీల్డ్ మేనేజర్ సీసీ జాదవ్, దశరత్, అరుణ్, సులోచన, ఖాతాదారులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే ఆరాటం'



మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

కైలాస్‌నగర్: పదేళ్లు అధికారంలో ఉండి ప్రజా సమస్యలను విస్మరించిన జోగు రామన్న, బీజేఎల్పీ నేతగా జిల్లాకు నిధులు తీసుకురావడంలో విఫలమైన పాయల్ శంకర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసం పాకులాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పదేళ్లుగా కేంద్ర పరిధిలోని అంశాలను అడగలేని వారిద్దరూ ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడం సరికాదన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీ ఎంపీని గెలిపిస్తే గిరిజన విశ్వవిద్యాలయం తరలింపును ఆపలేకపోయారన్నారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, నాగరాజు, నవీన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'మాదిగలకు ద్రోహం చేస్తున్న సీఎం'



మాట్లాడుతున్న జిల్లేపల్లి నవీన్

నార్నూర్: ఎస్సీ వర్గీకరణ చట్టం చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ద్రోహం చేస్తున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి నవీన్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం హోదాలో నిండు శాసనసభ సాక్షిగా మాట్లాడుతూ ఇంతకుముందు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో కూడా ఆర్డినెన్స్ తీసుకొచ్చి వర్గీకరణ అమలు చేస్తానని మాదిగలకు హామీ ఇచ్చి, ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల ఫలితాలను విడుదల చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేయడమే మాదిగల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, హేమంత్, చిప్పకుర్తి విజయ్, కిరణ్, మైలారం బాలాజీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు తాళం..!



జంబుల్‌ధరి పాఠశాలకు వేసిన తాళం

ఆదిలాబాద్‌రూరల్: ఐటీడీఏ పర్యవేక్షణలో కొనసాగుతున్న టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఏదైనా సమావేశం ఉంటే పాఠశాలకు తాళాలు పడుతున్నాయి. దీంతో విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ ఆశ్రమ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో 22 టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులతో సంబంధిత కాంప్లెక్స్ పరిధిలోని బుధవారం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం పాఠశాలలకు తాళాలు వేసి సమావేశానికి హాజరయ్యారు. పాఠశాలకు తాళం ఉండడంతో కొంత మంది విద్యార్థులు ఎండలో ఆడుకుంటూ.. కనిపించారు.

క్లుప్తంగా

దాబా(బి) గ్రామంలో పశువైద్య శిబిరం



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

ఇచ్చోడ: మండలంలోని దాబా(బి)లో బుధవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు అందచేసి మందులు పంపిణీ చేశారు. ప్రతీ వేసవిలో పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబధించిన టీకాలు వేయడం జరుగుతుందన్నారు. జిల్లా పశుగణాభివృద్ధిశాఖ అధికారి రామారావు, గోపాల మిత్రలు, శ్రీనివాస్, లక్ష్మినారాయణ, పశుపోషకులు పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి'



దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోథ్: ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి, అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బోథ్ బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టబద్ధత కల్పించేలా చూడాలన్నారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కుడాల స్వామి, నాయకులు కారం రవి, మహేశ్, బిక్క రమణయ్య, అశోక్, సదాశివ్, అద్దు ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కేసీఆర్‌తో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నేరడిగొండ: హార్వెస్ట్ మినిస్ట్రీస్ ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చర్చ్ పాస్టర్ డేవిడ్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నాగమల్యాల్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. వైద్య నిపుణులు బీపీ, షుగర్, రక్తపరీక్షలు, ఎక్స్‌రే, దంత పరీక్షలు, గర్భిణులు, పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు పంపిణీ

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇకపై ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని లఖంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ మంజుల లబ్ధిదారుల ఎఫ్ఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల ముఖం చూపిస్తేనే సరుకులు అందించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పారదర్శకంగా సరుకులు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

నేడు ఇచ్చోడలో కామ దహనం

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం 7 గంటలకు కామ దహనం కార్యక్రమం నిర్వహించనునట్లు వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు పెరమండ్ల నారాయణ, రేణికుంట సురేశ్‌లు తెలిపారు. శుక్రవారం హోలీ వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు.

వంటపాత్రలు అందజేత

బోథ్: బోథ్, సొనాల మండలాల్లోని ప్రాథమిక, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లకు మధ్యాహ్న భోజనం కోసం వంటపాత్రలు వచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి మహ్మమద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వంటపాత్రలు అందజేసినట్లు పేర్కొన్నారు.